# నాదవృష్టి

భద్రకాళికి ఆరు వాటాల ఇల్లుంది. అన్నిట్లోనూ అనుకూలంగా, పెద్దగా ఉన్న మధ్య ఇల్లును తను, మొగుడూ ఉండటానికి సెలెక్ట్ చేసుకుని, మిగతా ఐదు వాటాల్ని కుదిరినంత ఎక్కువ అద్దెలు వచ్చేలా అద్దెలకిచ్చింది. మంచి సెంటర్ లో ఉండటం వల్ల ఆ ప్రాంతంలో ఇళ్లంటే అందరూ చెవులు కోసుకుంటారు అంటే బాగుంటుంది కాని, నిజానికి చెవులు ఎలా కోసుకోగలరు? కాని, అప్పుడుప్పుడు ఆ ఇళ్లలో అద్దెకున్నవాళ్లు కూరలు తరుగుతూ వెలుతురు చాలక వేళ్లు కోసుకునేవారు. ఒకదాని మీదొకటి అద్దెల కోసమని కట్టిన ఇళ్లవటం వల్ల నీరు, గాలి, వెలుతురు తప్ప మిగతావన్నీ పుష్కలంగా ఉండేవి. ఎల్లప్పుడూ బల్లులు, బొద్దింకలు. నల్లులు, చెదలు, ఎలుకలు, దోమలు, ఈగలు మాత్రమే కాక అప్పుడప్పుడు జెర్రెలు కూడా పుష్కలంగా ఉండేవి.

పుష్కలంగా ఉన్నవాటిని తగ్గించడం విషయం, తక్కువగా ఉన్నవాటిని పెంచడం విష



లక్ష్మి మాధవ్

యం ఎత్తినప్పుడల్లా భద్రకాళి సార్థక నామధేయురాలిగా రౌద్రావతారం ఎత్తేది. ముందర ఎప్పుడైనా ఆమె అవతారం చూసిన మామూలు మనుషులైతే కరువుగా ఉన్నవాటిని గురించి గాని, పుష్కలంగా ఉన్నవాటిని గురించి గానీ పెద్దగా పట్టించుకోకుండా రోజులు నెట్టేసేవారు. వాళ్లే సర్దుకుపోయేవారు కాని మారు మాట్లాడటానికి సాహసం చేసేవారు కాదు. మరీ ధైర్యస్తులు, పరమవీరులు అయినవాళ్లు మాత్రం ఇలా అయితే ఇల్లు ఖాళీ చేస్తామని బెదిరించేవారు. అటువంటి వాళ్లకి ఇల్లు ఖాళీ చేసినా అడ్వాన్స్ తిప్పి ఇవ్వటానికి ముప్పుతిప్పలు పెట్టి తన గయ్యాళితనంతో మూడు చెరువుల నీళ్లు తాగించేది.

ఇలాంటిదేదో జరిగి భద్రకాళమ్మకి మూడ్ బాగోలేదారోజు. ఖర్మకాలి భర్త భజగోవిందానికి కూడా ఎప్పుడూలేనిది కాస్తంత కోపంగా ఉంది. భద్రకాళి గట్టిగా అరిచింది. ఆమెకన్నా గట్టిగా గీపెట్టటానికి ప్రయత్నించి, విఫలుడై కుదిరినంత గట్టిగా అరిచాడు భజగోవిందం.

భద్రకాళమ్మ కోపం తట్టుకోలేక అట్లకాడ పెట్టి పెనం చిల్లులు పడేలా కొట్టింది. చిక్కని చీకట్లో తారల్లా మెరుస్తూ కనిపిస్తోంది పెనం కిందనుంచి మంట. ఆ చిల్లుల పెనంలోంచి కనపడే మంటలా ఆమె మనస్సు కోపంతో భగభగా మండుతోంది. బయట హాల్లో భజగోవిందం పరిస్థితీ ఇలాగే ఉంది. తన చికాకు భద్రకాళి మీద చూపిస్తే ఆమె ఏం చేస్తుందోనని భయపడి, చదువుతున్న పేపర్ని పరపరా చింపాడు. పాపం అసలే బక్కచిక్కిన భజగోవిందం ఇక తన కోపం తాకిడికి తట్టుకోలేదనిపించి తిట్టుకుంటూ మనస్సు మరల్చుకోవటానికి బయటకు నడిచింది. బయట గుడిలోంచి రామ భజన వినపడటంతో కూలబడింది. అందరూ తన్మయత్వంతో పాడే భజన వినేసరికి మనస్సు శాంతించింది. అప్రయత్నంగానే ఆమె భజన పాడటం మొదలుపెట్టింది.

ఆమె భజనా పారవశ్యంలో ఉండగా ఆమె పక్కన కూర్చున్నామె వడిలో ఉన్న చంటికుర్రాడు భద్రకాళి చీర తడపడంతో ఆమె ఈ లోకంలోకి వచ్చింది. మళ్లీ కోపంతో ఆమె గొంతు తారస్థాయికి లేవబోతుండగా పక్కావిడ ఆమె కోపాన్ని కిందకు దించటానికి సరైన అస్త్రం ప్రయోగించింది. "మీరు భజన చాలా బాగా పాడారు. క్రితం వారం గుడిలో ఉత్సవాలలో మీ కచేరి కూడా చాలా బాగుంది. మీ కంఠస్వరం చాలా మధురంగా ఉంటుంది. ఈ మధ్యన ఏమైనా కొత్త సి.డీ.లు, క్యాసెట్లు రిలీజ్ చేసారా? నేను మీ ఫాన్‌ని" అంది అగ్గగ్గలాడుతున్నట్లు ఫోజు కొడుతూ.

అంతే... నీరు కారిపోయింది భద్రకాళి. ఆమె తనని ఇంకెవరో గాయని అని పొరబడుతోందన్న ఆలోచన వచ్చినా, వెంటనే పక్కకు తోసేసింది. నిజంగా తను భజన అంత బాగా పాడిందా? తన గొంతులోని కళని, మాధుర్యాన్ని గుర్తించక, తను దానిని అరుపులకి, అద్దెలవాళ్లతో దెబ్బలాటలకు, భజగోవిందంతో కయ్యాలకీ మాత్రమే వాడి వ్యర్థం చేస్తున్నందుకు నొచ్చుకుంది ఓ క్షణం. పక్కావిడ కొడుకు చేసిన పనికి చీదరగా ఉన్నా, దానిని ప్రకృతి సహజమైనదిగా క్షమించేసింది. ముచ్చటగా వాడి బుగ్గలు గిల్లింది ఆనందపడుతున్నట్లుగా.

ఈ లోగా స్వామీజీ భజన ముగించి ఉపన్యాసం మొదలు పెట్టారు. "మీ కోపమే మీ శత్రువు. మీకు కోపం వచ్చే పనిని ఎవరు చేసినా మీరు ప్రతిస్పందించకుండా, మీ మనస్సుని మీకు ప్రియమైన విషయం వైపుకి మరల్చుకోండి" అంటూ చెప్తున్న ఆయన ఉపదేశాన్ని

వెంటనే అమలు పరిచేసింది.

భద్రకాళి ఆ రోజునుంచి కోపతాపాలను జీవితంలోంచి తొలగించాలనుకుంది. పక్కావిడ తన పాట విని ఇచ్చిన కాంప్లిమెంటుని చాలా సీరియస్‌గా తీసుకుంది. తనకి సంగీతంలో నిజమైన ప్రతిభ ఉందో లేదో పరీక్షించుకోకుండానే కొత్త రంగంలోకి దిగి పెద్ద గాయనిగా పేరు పొందెయ్యాలన్న దృఢసంకల్పం అర్జెంటుగా అక్కడే చేసేసుకుంది.

నెమ్మదిగా రామ భజన హమ్ చేసుకుంటూ ఇంటి దాకా వచ్చి, ఇంట్లోకి అడుగు పెట్టగానే గట్టిగానే పాడెయ్యటం మొదలు పెట్టింది. భజగోవిందం తన కళ్లని తానే నమ్మలేకపోయాడు. మారీచుడు మాయలేడిగా మారినట్టు భద్రకాళి ఇంత సౌమ్యంగా అయిపోయిందేమిటా? అని ఆశ్చర్యపడ్డాడు.

వీరాంజనేయస్వామిలా బయటకు వెళ్లి నామె ప్రసన్నాంజనేయ స్వామిలా రామస్మరణ చేస్తూ ఇంటికొచ్చేసరికి మురిసి ముక్కలయ్యాడు. ఆమెని అదే మూడ్‌లో ఉంచమని, దయచేసి ఫ్లాష్‌బ్యాక్ సీన్లు ఇవ్వవద్దని దేవుడిని వేడుకుంటూ...

"అబ్బ! భద్రం ఎంత బాగా పాడుతున్నావే?" అన్నాడు తన్మయత్వం నటిస్తూ. అప్పటికే పొగడ్తలతో ఉబ్బి తారు డబ్బాలా అయినామె, తబ్బిబ్బై ఇంకో పది కేజీలు పెరిగి రోడ్‌రోలర్‌లా అయింది. తన సంగీత జ్ఞానాన్ని వేస్టుగా పోనియ్యకూడదని, త్వరలో అన్ని పద్ధతుల సంగీతాలనూ నేర్చేసుకోవాలని అనుకుంది. సరైన సంగీతం టీచరుని ఎలా పట్టుకోవాలా? అన్న ప్రశ్న ఆమెను పీడించసాగింది. ఇంత కాలంగా వృధా అయిన తన సమయాన్ని కూడదీసుకోవటం కోసం టీచరుని వెతుక్కునే లోపు గొప్ప గొప్ప విద్వాంసుల క్యాసెట్లు, రికార్డులు, సీడీలు పెట్టుకుని విని, వినికిడిజ్ఞానంతో తన సంగీతసుధని అభివృద్ధిచేసుకుంటూ సాధన చేసి ప్రావీణ్యం సంపాదించెయ్యాలనుకుంది. "శ్రద్ధగా సాధన చేస్తే ఇట్టే నేర్చుకోవచ్చు" అనేసుకుంది.

తర్వాత రోజు ప్రొద్దుటే క్యాసెట్ల షాపుకెళ్లి క్యాసెట్లని తేరిపార చూస్తూ సంగీతాన్ని అవపోసన పట్టాలంటే ఎన్నాళ్లు పట్టచ్చా? అని లెక్కలేస్తుంటే, షాపతను క్వశ్చన్ మార్కులా ముక్కుని కదుపుతూ,

"ఏం కావాలండీ?" అన్నాడు.

గబుక్కున భద్రకాళికి ఏం కావాలనాలో అర్థం కాలేదు. తికమక పడింది. చిట్టిబాబు పేరు విన్నట్లుగా జ్ఞాపకం వచ్చిందామెకు.

"చిట్టిబాబుగారివి గాత్రం క్యాసెట్లున్నాయా?" అంది. షాపువాడు అనుమానంగా ఆమె మొహం చూసి అయోమయంగా తల గోక్కుంటూ వెతుకుతున్నాడు. ఎంతసేపు వెతికినా అలాంటిదేదీ అతనికి కనిపించలేదు.

ఈలోగా భద్రకాళి "పోనీ ద్వారం మంగతాయారుగారి పాటలైనా సరే" అంది.

ఇంకొంత సేపు బుర్ర బరుక్కుంటూ వెతికి చివరికి "ఎమ్.ఎస్. సుబ్బలక్ష్మిగారి గాత్రమైతే బోల్డన్ని ఉన్నాయి. కావాలా?" అన్నాడు అప్పుడుగాని భద్రకాళికి ఆ ప్రముఖ గాయని పేరు తట్టలేదు. తన జ్ఞానశూన్యతకి ఓ నిమిషం బాధపడి మళ్లీ ఓదార్చుకుంది మనస్సులోనే.

"ఈ ఫీల్డ్‌కి కొత్తకదా... సరే ఇక మించిపోయిందేమీ లేదు. బాగా పాడి సంగీత కళాకారులంతా అబ్బురపడేలా, ఈర్ష్యపడేలా పురోభివృద్ధి చెందాలింక" అనుకుంటూ...

"పేరు పేరువరసనా చెప్పాలంటే నోరు తిర

గటం లేదు బాబు... ఇలాంటి వాళ్లందరి క్యాసెట్లు తీసి ఓ పక్కకు పెట్టు" అంది గంభీరంగా ఫోజుపెడ్తూ. ఆ రోజు ఇళ్ల అద్దెల బాపతు వసూలు చేసిన ఐదు వేలు కొంగుముడిలోంచి విప్పి బయటకు తీస్తూ.

"మూడు వేల రూపాయలకి క్యాసెట్లు, రెండు వేల రూపాయలకు సీ.డీ.లు ప్యాక్ చేసి ఉంచు నాయనా. నేను వెళ్లి ఆటో పట్టుకొస్తా" అంది దర్పంగా. ఆరోజు వరకూ ఆమెకి క్యాసెట్లు, సీడీలు వాడటానికి అవకాశం, అవసరం రాకపోవటం, ఏవి ఎప్పుడు ఎలా వాడాలో, కొనాలో అర్థం కాక తికమక పడింది.

ఆ రోజు బోణీ గిరాకీ ఎవరోనని గుర్తుతెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ, ఇంతమంచి బేరాలు వస్తున్నాయని మురిసి ముక్కలయ్యాడు షాప తను. ఆటోలో క్యాసెట్లు ఎత్తించుకుని ఇంటికొచ్చిన భద్రకాళి, వాటిని ఆటో అతనిచేత లోపలికి చేరవెయ్యడం చూసి భద్రకాళింట్లో అద్దెలకున్న వాటాలవాళ్లంతా బిత్తరపోయారు.

అందరూ గుసగుసలాడుకున్నారు. ఓనర్ భద్రకాళమ్మ వాళ్లందరినీ చీటికీ మాటికీ సాధించటం, నీళ్లకీ కరెంటుకీ ఇబ్బందులు పెట్టడం. గోడలనిండా క్యాలండర్లని, మేకులనీ తనివితీరా కొట్టుకోనీయకుండా ఆంక్షలు విధించి చంపటం వల్ల, ఇదివరలో వాళ్ల పాలిట విలనిడిగా ప్రఖ్యాతిగాంచింది.

ఇప్పుడు వాళ్లందరినీ ముప్పుతిప్పలు పెట్టే లాంటి కొత్త స్కీమ్ ఏదైనా తయారు చేస్తోందేమోనని భయపడి చచ్చారు. కానీ భద్రకాళి వాళ్లేవ్వరినీ పట్టించుకోకుండా ప్రశాంతంగా చిరునవ్వులు చిందిస్తూ లోపలికి వెళ్లిపోయింది. క్యాసెట్స్ ప్యాకింగ్ తీసి, రోజూ ఎవరి పాటలు ఎంతసేపు ప్రాక్టీసు చెయ్యాలో ప్రణాళిక తయారుచేయడంలో పడింది.

అందరూ ఓనర్ లోపలికెళ్లగానే మిగిలిన గుసగుసల్ని పంచుకుంటూండగా మొదలైంది ఓ మంచి త్యాగరాజు కీర్తన. వాళ్ల మొహాలు ఆశ్చర్యంతో పెద్దవవుతూండగా అది ఆగిపోయింది. మళ్లీ భద్రకాళి దానిలానే పాడాలని ప్రయత్నిస్తోందనటానికి చిహ్నంగా పాటలోని పదాలే విచిత్రమైన శబ్దతరంగాలుగా పరిణితి చెందుతున్నట్లుగా ఏదో వర్ణనాతీతమైన బాధ పడ్తున్నవారి మూలుగులులా వినవచ్చాయి. వాళ్లంతా అది ఆవిడ పాటేమోనని పసిగట్టేలోపే తృటిలో మళ్లీ గాయని పాట, మళ్లీ భద్రకాళి గొంతుతో పాటలాంటి సోకన్నాలు, మళ్లీ పాట.... మళ్లీ అ.. ఆ.. ఆ... లు వినిపించాయి. ఇలా ఓ పావుగంట సాగింది. భద్రకాళి పాట ఎలాగో వినసొంపుగా లేదు. పోనీ గాయని పాటైనా విందామంటే అది కూడా క్షణానికోసారి ఆగిపోతూ ఎక్కిళ్లలా వినపడ్తోంది. భద్రకాళికి కలిగిన విపరీత కోర్కెమిటా? అని వాళ్లు విస్తుపోతూండగా భజగోవిందం బయటనుంచి వచ్చాడు. తన ఇంటి నుంచి వస్తున్న ధ్వనులను చూసి కంగారు పడటం, లోపలికి అడుగు పెట్టటం. విషయం తెలవడం లిప్తపాటులో జరిగిపోయాయి. పాపం బక్కప్రాణి ఏమంటాడు? ఏదైనా అందామన్నా భద్రకాళి సార్ధక నామధేయురాలిగా తన పాత అవతారమెత్తుతుందని భయం... అందుకని హెల్మెట్‌ధారుడైన భజగోవిందం స్కూటరు దిగి చాలాసేపయినా ముందు జాగ్రత్త కోసం దాన్ని ధరించి మరీ భద్రకాళిని మందలించటానికి ప్రయత్నం చేసాడు.

"ఏమే భద్రం... నీ గొంతేమిటి మన బంగారం లాంటి పాత ఫాన్‌లా... అలా గరగరా... తిరుగుతోందేమిటి? కాస్త ఆగి, బాగా రెస్టు తీసుకుని తిరుగుతుందనిపిస్తోంది. అసలే

అలిసిపోయావ్! మిగతా సాధన రేపు చెయ్" అంటూ గండం తాత్కాలికంగా గట్టెక్కించాడు.

ఇదివరలో ఎవరో గాయకులు టి.వి.లో ఇంటర్వ్యూ చేసినప్పుడు చెప్పిన విషయం జ్ఞాపకం వచ్చిందామెకు. తరువాత రోజునుంచి తను కూడా ఇంట్లో ఉన్న నీటి తొట్టిలోనైనా పీకల దాకా మునిగి పాడాలని నిర్ణయం తీసుకుంది.

ఉదయం నాలుగు గంటలు కొట్టింది గడియారం. హడావిడిగా లేచింది భద్రకాళి. స్నానంచేసి భక్తిగా నీళ్ల తొట్టికి దండం పెట్టింది. కాలుజారి పడకుండా నెమ్మదిగా దాంట్లో దిగింది. చలికి నిమోనియా వస్తుందేమోనని భయంగా ఉన్నా పెద్ద ఎత్తున ఏదైనా సాధించాలంటే కష్టపడకతప్పదని మనస్సుకి నచ్చచెప్పుకుని నీళ్లలో దిగింది. నీళ్ల లెవెల్ ఓ అడుగుపైకి లేచింది... ఆర్కిమెడీస్ ప్రిన్సిపుల్‌ని మళ్లీ రుజువు చేస్తూ.

నిశ్శబ్దంగా ఉండటం వల్ల ఆమె పాట మరింత కర్ణకఠోరంగా వినిపిస్తోంది. పక్క వీధిలో కొత్తగా దిగిన సంగీతం టీచర్ వరదాచారి ఆమె అరుపులు విని ఉలిక్కిపడి లేచాడు. వడివడిగా నడుచుకుంటూ పాట వినిపించిన దిక్కుగా వచ్చాడు. భద్రకాళి సృష్టిస్తున్న శబ్ద కాలుష్యాన్ని దగ్గరనుంచి విన్నాక ఆయనకి విషయం ఇంచుమించుగా బోధపడింది. సంగీతం అంటే ఇంతగా తాపత్రయపడుతున్న ఆమె తపనని చూసి ముచ్చటేసిందాయనకి. ఎలాగైనా తనకి తోచిన విధంగా సహాయపడాలని కంకణం కట్టుకోకపోయినా, వాచీ అయినా కట్టుకోవాలని అనుకున్నాడు.

తిన్నగా భద్రకాళి వద్దకి వచ్చి తన మిగతా స్టూడెంట్స్‌ని డిస్టర్బ్ చెయ్యకుండా వచ్చి నేర్చుకుంటే నెలకో ఐదు వందలు ఫీజు తీసుకుని సంగీత సేవ చేస్తానన్నాడు. ఆమె సంతోషంతో పులకించిపోయింది. కానీ వరదాచారికి మాత్రం ఈమెకి నేర్పే గొడవలో తనే సంగీతం మర్చిపోతానేమోనని భయం కలిగింది.

భద్రకాళికి పాటల కన్నా సంగీతజ్ఞుల చరిత్రలు వినిపించటం మంచిదని ఉపాయం పన్ని ఆయన ఆమె నేర్చుకోవటానికి వచ్చినపుడల్లా ఇలాంటివే చెప్పి సమయం గడిపేవాడు. చివరిలో ఏదో ఓ కొంతసేపు ఆమె చేత ఏదో పాడించి ఇంటికి పంపేసేవాడు. సంగీతం పుస్తకం పాటలతో నిండడం చూసి ఆమె అన్నీ నేర్చుకున్నట్లే తృప్తిపడుతూ ఉండేది.

వరదాచారి పాతకాలంలో సంగీతం నేర్పే గురువులకి శిష్యులు ఎలా సేవలు చేసేవారో, వాళ్ల గురుభక్తి వల్ల వాళ్లకి సంగీతం ఎంత బాగా అబ్బిందో అస్తమానం విడమర్చి చెప్పటంతో భద్రకాళి వరదాచారి ఇంటి పనిలన్నీ సంగీత పాఠానికి వెళ్లినప్పుడు మీద వేసుకుని మరీ చేసేది. దానితో వరదాచారి భార్య ఆమెని శిష్యోత్తమురాలని, అఖండ శిష్య శిఖామణి లాంటి బిరుదులు ఉదారంగా ఇస్తూ నానా చాకిరీ చేయించేది. కాని భద్రకాళి పాడి వాళ్లకి విధిస్తున్న శిక్షకు ప్రత్యామ్నాయం ఏం చేస్తే మాత్రం తీరుతుంది?

## గమనిక

సాహిత్య కార్యక్రమాల ఫోటోలు ప్రచురణార్థం పంపించేటపుడు ఆ కార్యక్రమం జరిగిన తేదీ, స్థలం తప్పక ఉదహరించాలి. ఈ వివరాలు లేకుండా వచ్చే ఫోటోలు ప్రచురణకు స్వీకరించబడవని గమనించగోర్తాం.

– ఎడిటర్

భద్రకాళమ్మగారు సంగీత సాగరంలో ఈదుతూ అందర్నీ ముంచుతున్నా అందరికీ ఆమె గయ్యాళి అవతారం కన్నా ఇది ఎంతగానో నయం అనిపించి ఆమెని పెద్దగా పట్టించు కోవటం మానేసారు.

ఆ ఊరి మహిళా సంఘం వారు సంగీతం పోటీలు ఏర్పాటు చేశారు.

భద్రకాళి పోటీలలో పాల్గొని తన గాన మాధుర్యంతో అందరి మనస్సులు దోచి తన్మ యంతో ఊగేలా చెయ్యాలనుకుంది. దాని కోసం ఇంకా కఠోరంగా రాత్రి, పగలూ సాధన చెయ్యటం ప్రారంభించింది. పోటీ క్రితం రోజు రాత్రంతా ప్రాక్టీసు చేసింది భద్రకాళి.

అదే రాత్రి దోపిడీదారుల గుంపు ఒకటి ఆ ఏరియాలో చాలా ఇళ్లలో దూరి దోపిడీలు చేశారు. భద్రకాళి వాళ్ళిల్లు ఉన్న వీధిలో మాత్రం ఏ ఇల్లు దోచుకోవటం కుదరలేదు వాళ్లకి. భద్రకాళి గొంతు చించుకొని తార స్థాయిలో చేస్తున్న స్వర విన్యాసాల ధాటికి జడిసి వాళ్లు ఆ ఛాయలకు రాకుండా వెళ్లిపోయారు. తరువాత రోజు డిటెక్టివ్ ఏజన్సీ వాళ్లు, పోలీ సులు తీసిన ఆరా వల్ల దుండగులు భద్రకాళి అరుపులకి భయపడి అటు రాలేదని, సాధా రణంగానే ఆ వీధికి ఆటోరిక్షాలవాళ్లు, పూలు కూరగాయలమ్మేవాళ్లు గాని, ఎల్కక్ట్రీషియన్లు గానీ వెళ్లే సాహసం చెయ్యరని తెలిసింది.

ఈగిల్ ఐ సెక్యూరిటీ సర్వీసెస్ మేనేజర్ జీప్‌లోంచి దిగాడు. అతనితో ఫుల్ యూని ఫారంలో ఉన్న ఇద్దరు సెక్యూరిటీ గార్డులు కూడా దిగారు. హుందాగా నడుస్తూ భద్రకాళి ఇంటి గేటు లోపలికి వచ్చారు. గార్డులిద్దరూ తలుపు దగ్గరే ద్వారపాలకుల్లా ఎదురు చూస్తు న్నారు. అతడు మాత్రం లోపలికి వెళ్లాడు.

భద్రకాళి హార్మోనియం పెట్టెముందు కూర్చొని గట్టిగా తాళం వేస్తూ నోరు పెద్దదిగా చేస్తూ ఏదో పాడటానికి ప్రయత్నిస్తోంది.

భజగోవిందం ఆమె పాటలను వినలేక చెవుల్లో దూది కూరుకుని పుస్తకం చదువు కుంటున్నాడు. మేనేజర్ భద్రకాళికి నమస్కారం పెడ్తూ వినయంగా అన్నాడు.

"గుడ్... ఈవినింగ్ మేడమ్. మీరు పరోక్షం గా దోపిడీకారులు ఎటాక్ చెయ్యకుండా సెక్యూ రిటీ వాళ్లకి సహకరించగలరని మా సెక్యూరిటీ పెర్సనల్స్ ద్వారా వచ్చిన సమాచారం వల్ల తెలి సింది. క్రితం వారం ఈ ఏరియాలో చాలా ఇళ్లను దోచుకున్న దుండగులు మీ కంఠస్వరం విని పారిపోయారని తెలిసింది. సెక్యూరిటీ సర్వీ సెస్ ఇవ్వటంలో మీ లాంటి కంచుకంఠం, ధైర్యం గలిగిన స్త్రీలు మాకు సహకరించగలరని ఆశిస్తున్నాం. త్వరలో నేను, ఇంకా కొంతమంది ముఖ్యులూ వచ్చి ఈ విషయంలో కాంట్రాక్ట్ సైన్ చేసుకుందామనుకుంటున్నాం. డీటైల్స్ అన్నీ ఈ కాయితాల్లో ఉన్నాయి. వియ్ విల్ కాంటాక్ట్ యు లేటర్‌ఆన్" అని సెల్యూట్ కొట్టి వెనుదిరిగాడు.

భద్రకాళి, ఆమె భర్త భజగోవిందం పరమా నందభరితులయ్యారు. భద్రకాళి రాగాలు రోగాలు కుదర్చడంలోగాని మనోరంజకంగా కానీ లేకపోయినా రోగ్‌లను అరికట్టడంలో ఉపయోగపడ్తోందని ఆనందించారంతా.

తమకిష్టమైన అభిరుచుల్ని నేర్చుకోవడం కన్నా తమకి ప్రతిభాచాతుర్యం గల హాబీలలో ప్రావీణ్యం సంపాదించాలని ప్రయత్నించడం తమకి, తమ చుట్టుపక్కలవాళ్లకీ సుఖం అన్న కిటుకుని ఆమె గ్రహించుకోలేకపోయినా చాలా మంది గ్రహించుకున్నారు. ●